# సహనం

**నే**నా సమయంలో బెజవాడ ఎందుకు వెళ్ళానో నాకు సరిగ్గా జ్ఞాపకం లేదు. కాని స్నేహితుడు కామరాజు నన్ను బలాత్కారంగా సినిమాకు తీసుకుపోవటమూ, "ఆ పిక్చరు బాగా లేదంటున్నారు నేను రాను" అని నేననటమూ, "వేరే ఒకందుకు రమ్మంటున్నాను బాగుండని పిక్చరుచూస్తే ఇంతలో నువ్వేమీ సొట్టపోవులే!" అని కామరాజు నన్ను దెప్పటమూ నాకు బాగా జ్ఞాపకం ఉంది.

మేము వెళ్ళేసరికి హాలు చాలాభాగం ఖాళీగా వుంది. ఆ పిక్చరు వారమే నడిచింది. మేం ఆఖరురోజు కాబోలు చూశాం. బాగుండని పిక్చర్లు చూడటం నాకు చాలా బాధ. సొట్టపోనని కామరాజు అనగానే సరా? నా లోపల చాలా డామేజి జరిగింది

"నా చేత ఈ దిక్కుమాలిన పిక్చరెందుకు చూడనిచ్చావో దయచేసి చెబుతావా?" అని నేను కామరాజును, తిరిగి వచ్చేటప్పుడు దబాయించాను.

"రెండో హీరోయిన్ వేసిన సుశీల ఎట్లావుంది? అన్నాడు కామరాజు, మళ్ళీ నాకు పిక్చరు జ్ఞాపకం తెచ్చి బాధ పెడుతూ.

“నా కేమీ గొప్పగా కనిపించలేదు.” అన్నాను.

“ఏం గొప్పగా కనిపించాలి? ఆ పిల్ల ఎంత అందంగా ఉంటుందో తెలుసా?”

“అందంగా లేదని నేననలేదు. గొప్పగా కనిపించలేదన్నాను. అంటే నటనలో పొడిచెయ్యలేదని నా ఉద్దేశం.”

“ఆఁ, ఆ డైరెక్టరు పట్టినాజ. నువు సుశీలను చూస్తే నీ అభిప్రాయం మార్చుకుంటావు” అన్నాడు కామరాజు.

“నే నిప్పుడు కనిపెట్టుకుని ఆమెను చూడటం దేనికి, నా అభిప్రాయం మార్చుకోవటం దేనికి?” అన్నాను.

“ప్రస్తుతం బెజవాడలోనే ఉంది. నువ్వుచూసి పని కొస్తుందంటే మన పిక్చర్లో బుక్ చెద్దామని!”.

నేను ఎవరో కొట్టినట్లు ఆగాను. “మనం” పిక్చరుతీసే ఆలోచనలో ఉన్నట్లు కామరాజు నాకుముందుగా చెప్పలేదు. అదీగాక నేను పిక్చర్లు తియ్యటం విషయంలో కామరాజు కన్నా తక్కువ తెలిసినవాణ్ణి - వాని కటువంటి ఆలోచనైనా తట్టింది. నాకెన్నడూ అది తట్టలేదు. మా వానివంటి వాళ్ళను గురించే బమ్మెర పోతరాజుగారు, “కానని వాని నూతగొని కానఁడు వాడు విశిష్టవస్తువుల్ కాననిభంగి” అన్న పద్యంరాశారు. ఆ మాటే అన్నాను.

“అట్లా కాదు లే!” అని రెండు ముక్కలతో నన్నూ, పోతరాజుగారినీ కూడా తీసేశాడు.

అవతలివాడు మన దగ్గరలేని డబ్బు వుందనిగాని, రాని విద్య వచ్చుననిగాని అపోహపడితే కలగని ఆనందం, మనకు సినిమాలను గురించి తెలుసుననుకుంటే కలుగుతుంది.

నేనుకూడా అటువంటి ఆనందమే పొందనవాణ్ణాయి, మర్నాడు ఈ సుశీలను చూడటానికి సమ్మతించాను.

సుశీల ఎక్కడో బందరు కాలవ కట్టన ఒక గుహ లాంటి భాగంలో ఉంటున్నది. మర్నాడు ఇద్దరమూ అక్కడికి వెళ్ళాం. మొదట, "ఏమండీ! ఎవరండీ! లోపలా!" అని రెండు మూడుసార్లు కేకేశాం. కాని జవాబు లేదు. కామరాజు తలుపుమీద రెండు తట్లు తట్టినాక, "ఎవరా తలుపు తట్టేదీ?" అని కోపంగా ప్రశ్న వినిపించింది. కబురందిందిగదా అని తలుపుకేసి ఆశగా చూస్తూ నిలబడ్డాం. రెండు నిమిషాలు గడిచినా తలుపు తెరుచుకుంటుందన్న మా ఆశ కనిపించ లేదు. కామరాజు మళ్ళీ తలుపు తట్టాడు.

"ఎవరంటే చెప్పకుండా అదేమిటి తలుపు తడతారు. వేళాకోళమా ఏం?" అని మళ్ళీ లోపల్నుంచి కోపంగా వినిపించింది.

"ఒకే, కామరాజూ! అది ఆడగొంతా, మగగొంతా? నువ్వేది అన్నా అది కాదని నేను పందెం వెయ్యటానికి సిద్ధంగా ఉన్నాను." అన్నాను.

అసలే కామరాజుకు మండిపోతోంది. నా మాటలు వాణ్ణి మరింత కోపం తెప్పించాయి. వాడికి సెన్స్ ఆఫ్ హ్యూమర్ లేదు. "తలుపు తెరవండీ!" అని ఒక్క పొలి కేక పెట్టాడు వాడు.

"ఒకవేళ కొంపతీసి ఎవరన్నా తలుపు తెరుస్తారేమో. మనం పారిపోవటం మంచిదని నా ఉద్దేశం. తరవాత నీ యిష్టం" అన్నాను.

కాని నేను భయపడ్డట్లు జరగలేదు. ఆ తలుపు తెరుచుకోలేదు. ఆ లోపలినుంచి మాట్లాడేవ్యక్తి—తలుపు చప్పుడు తప్ప మరే చప్పుడుకూ చలించేటట్లు కనబడలేదు. మేం ఆ మనిషిని కదిలించి కార్యరంగంలోకి దించాలంటే తలుపు తట్టటం తప్ప మరోదారి లేనట్లు స్పష్టమయింది. తలుపు అదే విధంగా తట్టుతూ కూచుంటే ఆ మనిషి ఎప్పటికైనా వచ్చి తలుపు తీసే అవకాశం ఉంది. మేం ఆ మనిషికి కోపం మాత్రమే తెప్పించాం గాని లేచి వచ్చి తలుపు తీసేటంత శక్తి ఉత్పాదన చేయలేక పోయాం. అందుకు సందేహం లేదు.

మూడోసారి తలుపుతట్టే దమ్ము కామరాజుకు లేనట్లు కనబడటంవల్ల, "పోనీ, మనం ఇప్పుడు వెళ్ళి తలుపు తెరచి ఉండే సమయంగా చూసి వస్తేనేం?" అన్నాను, తలుపవతల ఉన్న మనిషి మన స్తత్వం మావాడికో అబ్బినట్లుంది. వాడు నా మాటలు వినిపించుకోలేదు.

మేం అట్లా ఆ మూసిన తలుప్పుకేసి మౌనంగాచూస్తూ ఎంతసేపు నిలబడి ఉండేవాళ్ళమో తెలీదు. ఈలోపల దేవుడల్లే—కనీసం మారువేషంలో ఉన్న దేవుడల్లే—ఒక వ్యక్తి వచ్చాడు. మారువేషంలో ఈ దేవుడు నల్లగా, సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. సిల్కు లాల్చి వేసుకున్నాడు. బీడి కాలుస్తున్నాడు. మెడలో సన్నని బంగారు గొలుసు ధరించాడు. ఉంగరాలు తిరిగినజుట్టు అతని తలకు రెండు వేపులా ఏ ఆధారమూ లేకుండా నాలుగేసి అంగుళాల దూరం క్రాపు రూపంలో పక్కలకు వ్యాపించి నిలబడివుంది.

"ఎవరుమీరు ?" అన్నాడీ దేవుడు మామీద కచ్చ ఉన్నవాడల్లే.

"మేం సుశీలను చూడటానికి వచ్చాం," అన్నాడు కామరాజు.

"ఏం పని ?" అన్నాడు ఆ మనిషి ఇంకా కోపంగానే.

"మేం సినిమా తీయబోతున్నాం," అన్నాడు కామ రాజు.

బీడి కాల్చే మనిషి ఒక్క క్షణంపాటు కామరాజు కేసి నమ్మలేనట్టుగా చూసి, బీడి పక్కన సైడ్ కాలవలో పారేసి, తలుపు దడబడా తట్టాడు. మరుక్షణంలో తలుపు తెరుచుకున్నది. కామరాజు పిచ్చగాని ఆ తలుపును అట్లాగే తట్టాలి. ఆ సంగతి నేను వాడితో చెప్పి ఉన్నట్టయితే, "నే చెప్పలేదుట్రా ?" అని ఉండేవాణ్ణే నాలో నే ననుకున్నా నేమో చక్కని అవకాశం జారిపోయింది.

తలుపు తెరచిన హిడింబిలాటి ఆడమనిషి వాకిలి కడ్డంగా నిలబడి మాకేసి కోపంగా చూసింది. (ఆ మనిషి ఆడదని మా కామరాజు పందెం వేశాడుకాడు, నిష్కార ణంగా ఓడిపోయి ఉండును.)

"ఎవరో సినిమా వాళ్ళట బుల్లిని చూడొచ్చారు." అని సిల్కు లాల్చీ మనిషి అయిష్టంగా వివరించాక హిడింబి దారి ఇచ్చింది. మేం భయపడుతూ, భయపడుతూ లోపలికి వెళ్ళాం. ఆ ఇంటికి సంబంధించిన వ్యక్తుల్లాగే ఇల్లుకూడా కోపంగా, సంస్కార హీనంగా వుంది.

అటువంటి వాతావరణంలో ఆ మనుషుల మధ్య చూడటంవల్ల కాబోలు నాకంటికి సుశీల మరింత అందంగా, నాజూకుగా, తెలివిగా, మంచిగా కనబడింది. ఆమెకు పద్దెనిమి దేళ్ళకంటె ఉండక పోవచ్చు ననుకున్నాను. మనిషిలో సహజ సౌందర్యం చాలా ఉంది. దానికితోడు నాజూకు కూడా తెలుసు. మాట్లాడుతుంటే గొంతు మెత్తగా, మాట మర్యాదగా, వైఖరి సంస్కారం గలదిగా కనిపించింది మా కామరాజు అన్న మాట నిజమే అయి ఉండాలి ఇంకోమంచి డైరెక్టరు చేతిలో పడితే రాణించగల మనిషి.

సుశీల దగ్గర లేనిపోని పోజులుగాని, నిక్కుగాని, బిడియంగాని లేవు హిడింబి ఆమె తల్లి అనీ, ఆ క్రాపువాడు ఆమె అన్న అనీ మేం తెలుసుకున్నాం. వాళ్ళ ధోరణి ఆ విధంగా ఉంటే ఈ పిల్ల వాళ్ళకు ఇంత భిన్నంగా ఎట్లా తయారు కాగలిగిందో నా కర్థం కాలేదు.

మా కామరాజుకు సినిమాచిత్రం తీయాలని ఉందనీ, అందులో తమకు వేషం ఇద్దామని అనుకుంటున్నాడనీ నేను సుశీలతో చెప్పాను. సుశీల పెద్దగా సంతోషించనూలేదు. తనకు వేషం అక్కర్లేనట్లు నటించనూ లేదు. సినిమాలలో నటించి పైకి రావటానికి కావలసింది అదృష్ట మన్నది ఎవరు తన్ను పైకి తీసుకొస్తారో చెప్పలేమన్నది. తనకన్న తెలివిగల వాళ్ళే అదృష్టం లేక పైకి రావటంలేదన్నది. ఇవన్నీ కడుపు లోనుంచి వచ్చిన మాటలో కాదో తెలీదు గాని ఆ పిల్లకు మాట్లాడే వైనం తెలుసు ననటానికి సందేహంలేదు.

మేము యింట్లో ఒక అరగంటసేపు కూచున్నాం. మాకు సుశీల ఏ లోపమూ చెయ్యలేదు. తల్లిని కాఫీ చెయ్యమని పురమాయించింది. అన్నను పక్క అంగడికి వెళ్ళి మంచి కిల్లీలు కట్టించుకురమ్మని పంపింది. ఆ ఇద్దరూ మిగిలినవాళ్ళ దగ్గర యమకింకరుల్లే ప్రవర్తించినా సుశీల దగ్గర చాలా వినయ విధేయతలతో మసులుకోవటం కనిపించింది.

మేం సుశీల దగ్గిరనుంచి వచ్చేసేటప్పుడు, "ఏమంటావు?" అన్నాడు కామరాజు.

"పనికొచ్చే పిల్లాలాగే ఉంది" అన్నాను

"పనికిరావటమేమిటి? నే నివాళ చెబుతున్నాను జ్ఞాపకంపెట్టుకో—సుశీల కొద్దిరోజుల్లో గొప్ప స్టారవుతుంది," అన్నాడు కామరాజు.

"నన్నడిగితే ఆ అమ్మాయి పైకి రాదు. ఎండు కట్టెలాగా భగ్గున మండి ఆరిపోతుంది. ఈ పిల్లకున్న అందమూ, శక్తీకూడా లేనివాళ్ళు ఈమెను దాటి పైకిపోతారు," అన్నాను. ఇది అక్షరాలా జరగబోతుందని ఆ క్షణంలో నేను కూడా ఊహించలేదు.

"అదేం?" అన్నాడు కామరాజు, ఆశ్చర్యంగా.

"ఆ సుశీల వెంటఉన్న గ్రహాలను చూశావా?"

"అదా నీ అనుమానం? వాళ్ళమొహం. వాళ్ళదేమీ లేదు. పెత్తనం సుశీలదే! ఆ పిల్ల దగ్గర వాళ్లు కుక్కిన పేలనుకో!" అన్నాడు కామరాజు.

"అదే వచ్చిన చిక్కు. వాళ్ళమీద ఆ పిల్ల అధికారం సాగినన్నాళ్ళూ వాళ్ళనుంచి ఆ పిల్ల బయటపడదు. వాళ్ళ ప్రభావం ఆ పిల్లమీద ఉండనే ఉంటుంది. అది ఆ పిల్లను కాలక్రమాన కుంగదీసి తీరుతుంది" అన్నాను.

నామాట కామరాజుకు నచ్చకపోవటంలో ఆశ్చర్యం లేదు. కాని నా మాటమీద వాడికి గురికూడా లేకపోయింది. అందువల్ల కూడా ఆటే నష్టం ఉండకపోను... వాడు అనుకున్న ప్రకారం పిక్చరుతీసి ఆమెను అందులో ఉపయోగించుకుంటే.

కాని దురదృష్టవశాత్తూ కామరాజు పిక్చరు తీయలేకపోయాడు. ఆ రోజుల్లో ఏ నలభై వేలతోనో పిక్చరు తీసే అవకాశం ఉంది. పదివేలు చేతిలో ఉంటే మిగతాది డిస్ట్రిబ్యూటర్లు ఇచ్చేవాళ్లు కామరాజు దగ్గర పుష్కలంగా డబ్బున్నది కూడాను—వాళ్ళ నాన్న కాటక మప్పుడు బాకీదార్ల దగ్గరనుంచి చచ్చు ధరలకు బోలెడన్ని పొలాలు తీసుకున్నాడు. అయితేనేం? తన కొడుకు సినిమాలలోకి పోయి చెడిపోతాడని ముసలాడికి విచారం పట్టుకుంది. "నువు సినిమా తీస్తే నేను ఏ రైలుకిందో పడతాను. తరవాత నీయిష్టం!" అని బెదిరించాడు.

"మా నాన్నకు తెలీయకుండా నీపేర తీస్తాను. సరేనను!" అని నన్ను ప్రోత్సహించాడు వాడు. నేను సరేననలేదు. అంతటితో ఆ ప్రయత్నం పోయింది. తరువాత కొద్ది రోజులకే సుశీల ఇంకేదో పిక్చర్లో నటించి మంచి పేరే తెచ్చుకుంది.

"సరి అయిన తరుణంలో చాన్సు పోయింది. ఇంకో పిక్చర్లో నటించిందంటే మనం వెళ్ళి పలకరించటానికి కూడా ఉండదు. పెద్ద స్టారయిపోతోంది సుశీల," అన్నాడు కామ రాజు నన్నొకసారి కలుసుకుని.

"పోతే పోనీ, ఇంకా చాలామంది ఉన్నారు." అన్నాను.

కాని సినిమా ప్రపంచంలో మే మిద్దరమూ అనుకోని పరిణామాలు చాలా జరిగాయి. మొదటి సంగతి—పిక్చర్ల ఖరీదు పెరిగింది. యుద్ధం వచ్చింది. మా కామరాజు అన్న ట్టుగా సుశీల పెద్దస్టార్ కాలేదు. ఆమె నటించిన మూడో పిక్చరులో ఆమె ప్రేక్షకులకు ఆశాభంగం కలిగించింది. నాలుగో పిక్చరులో చచ్చువేషం దొరికింది. తరువాత ఆమెకు బుకింగులు లేకుండానే పోయాయి.

ఒకసారి కామరాజు మా వూరు వచ్చాడు. ఏదో మాటల సందర్భాన. "సుశీలను గురించి నువ్వన్నమాట అక్ష రాలా నిజం. నాకు సుశీల అంతా చెప్పింది" అన్నాడు.

"నే నేం చెప్పాను?" అన్నాను. నా కేమీ అర్థం కాలేదు.

సుశీల పైకి రాలేక పోవడానికి కారణం ఆమె తల్లీ, అన్నయ్యేనని కామరాజు నాకు రూఢిగా చెప్పాడు.

"వాళ్ళ ప్రభావానికి లొంగేదైతే వాళ్ళకు అంత భిన్నంగా ఎందుకుంటుందని నాకు అనుమానం వేసింది. అందు

చేత నీమాట నమ్మలేదు తీరా విచారి స్తే సుశీలలో అంత తేడా ఉండటానికి కారణం వేరేఉంది. అది వాళ్ళమేనమామ దగ్గిర పెరిగింది. మేనమామ పోయాక తల్లీ, అన్నా గ్రహాలై పట్టారు ఇంకెవరో సినిమా చాన్సు ఇప్పించారు. కాని సుశీల దిగజారిపోయింది. నేను ఈమధ్య చూశాను. ఏ చెట్టి యారో చేరదీసి డబ్బిస్తున్నాడని నా అనుమానం. ఇప్పుడు చూస్తే సుశీల సినిమా స్టారుగా పనికివస్తుందని కూడా నమ్మ లేవు" అన్నాడు కామరాజు.

"మనిషి వికారంగా అయిపోయిందా?" అన్నాను.

"వికారంగా కాలేదు. అందంగానే ఉంది. కాని అప్పటి లక్షణాలే లేవు మనిషిని చూస్తే ఇటువంటి మని షిని సినిమాలలోకి ఎట్లా తీసుకున్నా రనిపిస్తుంది. చూస్తే గాని నీ కర్థంకాదు." అన్నాడు కామరాజు.

"ఎట్లా చస్తే మనకేం? పోనిస్తూ!" అన్నాను చిరా కుగా.

"నేను సినిమా తియ్యటం ఉత్తదిగాని, సుశీలను మళ్ళీ సినిమా స్టార్‌నుచేసి తీరుతాను. చూస్తూ ఉండు," అన్నాడు కామరాజు.

నేను నిర్ఘాంతపోయి, "ఏం చెయ్యబోతున్నావ్?" అని అడిగాను.

"సుశీలను పట్నంనుంచి తెచ్చేశాను. బెజవాడలో పెట్టాను," అన్నాడు.

"తీసుకు రావడమే?" అన్నాను.

"అవును తల్లినీ, అన్ననీ వెంట వుండటానికి వీలు లేదన్నాను కావలిస్తే వాళ్ళకు డబ్బు పంపిస్తాను. సుశీలను మళ్ళీ సినిమా స్టార్ చెయ్యాలి. అవుతుంది కూడాను ఒక సారి నువ్వు వచ్చి చూడు. కాస్త మనవంటి వాళ్ళమధ్య కొన్నాళ్ళుంటే మనిషి మారిపోతుంది." అన్నాడు కామ రాజు.

"ఇదంతా నీ కెందు కొచ్చిన బెడద?" అన్నాను.

కామరాజు నాతో వాదించలేదు. తరువాత కొద్ది రోజులకు నేను బెజవాడ వెళ్ళినప్పుడు సుశీలను చూశాను. మావాడు చెప్పినమాట నిజమే. సుశీల ఇప్పుడు పూర్వం కన్నాకూడా అందంగానే ఉంది కాని మనిషి లోలోపల జారిపోయింది. ఇప్పు డామె మాట్లాడుతుంటే అందరూ మాట్లాడినట్టే ఉందిగాని ప్రత్యేకాకర్షణ ఏమీ లేదు. మేము బందరు కాలవ వొడ్డున ఇంట్లో చూసిననాడు ఆమె మాతో చేసిన ప్రసంగంలో బోలెడంత అభినయం ఉందని నాకివాళ అర్థమయింది! ఈ మనిషిని మళ్ళీ సినిమాస్టార్ చేస్తే మన వాడు పూరా ప్రయోజకుడే అనుకున్నాను వాని ఓర్పు తలుచుకుంటే నా కాశ్చర్యం వేసింది. కాని వాని యత్నం కొనసాగుతుందని నా కే కోశానా ఆశ లేదు.

అప్పుడప్పుడూ బెజవాడ వెళ్ళినప్పుడు సుశీలను చూస్తూండేవాణ్ణి. ఎన్ని నెలలు గడచినా నా కామెలో చెప్పుకోతగిన మార్పేమీ కనిపించ లేదు.

ఒకసారి నేను వెళ్ళేసరికి కామరాజు ఇంట్లో లేడు. సుశీల నాకు మామూలు మర్యాదలన్నీ చేసింది. రెండు కప్పులు కాఫీ తయారుచేసి తెచ్చి నా కెదురుగా కూచొని, "అన్నట్టు మీ రొకప్పుడు నేను సినిమాలలో పైకి రానని ఆయనతో అన్నారుట కదూ?" అని అడిగింది.

"నీతో అన్నాడా ఏమిటి?" అన్నాను.

"ఏదో మాటల సందర్భంలో అన్నారు" అన్నది.

ఈ ప్రశ్న సుశీల ఎందుకు వేసిందో నా కర్థం కాలేదు. ఆ విషయం మళ్ళీ ఎత్తలేదు. నేను అంతకన్నా ఎత్తలేదు.

మరి కొన్నాళ్ళకు నేను వాళ్ళింటికి వెళ్ళినప్పుడు కామరాజు "ఒరే, సుశీలకు మళ్ళీ ఏ సినిమాకైనా బుక్ చేయిస్తే బాగుణ్ణని చూస్తున్నాను. ఎవరిద్వారా పని అవుతుందంటావు?" అని అడిగాడు.

"ఒకరిద్వారా ఏమిటి? ఆవిణ్ణి ఎరిగిన సినిమావాళ్ళే లేరా? ఇద్దరూ కలిసి పట్నం వెళ్ళి కొద్దిరోజులు మకాంపెట్టి చూడండి" అన్నాను.

"మీరు కూడా ఆయన పిచ్చిలోనే పడతా రేమండీ? మీ రేమో మొహమాటం లేని మనిషి అనుకున్నానే?" అన్నది సుశీల.

"నా కెందుకు మొహమాటం?" అన్నాను,

"నేను సినిమాలకు పనికిరానని ఉన్నమాట చెప్పెయ్యకూడదూ?" అన్నది.

"అది ఉన్నమాట ఏమిటి?" అని అడిగాను.

"నేను పనికొస్తానని మీరు నిజంగా నమ్ముతున్నారా?" అన్నది.

"సినిమాకు పనికిరాని మనుషులంటూ ఉన్నారా?" అన్నాను.

"అట్లాఅయితే సరేలెండి," అన్నది సుశీల, ఏదో అర్థం చేసుకున్న దానిలాగా.

నాకు ఒళ్ళు మండిపోయింది. "అబ్బో! నువ్వే సినిమాలలో ప్రవేశిస్తే అందరి స్టార్లనూ తలదన్నుతావు." అని నేననాలని ఆమె ఉద్దేశమైతే నేను నా గొంతులో ఊపిరి ఉండగా ఆ మాట అనను ఇంకో మనిషిని ఉబ్బేసేటందుకు తగిన ఓపిక నాకు లేదు. అది మా వాని సొత్తు.

"అదేమిటి, సుశీలా? నువు ఒకప్పుడు సినిమాలకు పనికివచ్చినదానివేగా!" అన్నాడు కామరాజు.

"మధ్యలో పనికిరాకుండా పోలా?" అన్నదామె.

మళ్ళీ మారావేమో! చూస్తేతప్పేం?" అన్నాడు వాడు.

"నే నేమీ మారలేదు. నే నెప్పుడూ సినిమాలకు పనికి రాలేదు. నన్నిలా బతకనివ్వండి" అన్నది సుశీల.

ఈ మాటలూ, ఆమె గొంతూ వింటుంటే నా కాశ్చర్యం వేసింది. నేను పొరపాటు పడ్డాను, ఆమెకు సినిమాలలో నటించాలని లేదు.

సుశీలతో ఒంటరిగా మాట్లాడే అవకాశం దొరకగానే అడిగేశాను.

"ఒకప్పుడు మా అమ్మా, అన్నయ్యా నన్ను సినిమాలకు పనికొస్తానని గాసుకొట్టారు. నమ్మాను. మళ్ళీ ఇప్పుడీయనా అదే సాగించాడు. నేను చచ్చిపోతున్నాను. మీరైనా చెబుదురూ—నేను పనికిరానని!" అన్నదామె. "నేనేమీ మారలేదు" అని ఆమె ఎందుకన్నదో నాకర్థమయింది.

"కాని, మా కామరాజు మనసు కూడా కాస్త గమనించు. వాడు ఎంతో ఓర్పుతో నిన్ను సినిమా స్టారును చెయ్యాలని ప్లానుకొన్నాడు. నువు సినిమాలే వొద్దంటే వాడు చిన్నబుచ్చుకుంటాడు" అన్నాను.

"ఒకవేళ మేం పట్నం వెళతామనుకోండి. నన్నెవ్వరూ తీసుకోకపోతే అప్పుడైనా ఆయన చిన్నబుచ్చుకోక తప్పదుగా!" అన్నది.

"అప్పుడు నీ తప్పుండదు. నీ ధర్మం నువు చేసినదానివవుతావు." అన్నాను.

"ఎట్లాగైనా నేనొక సినిమా చాన్సు సంపాదిస్తే నా రుణం తీరిపోతుందంటావా ఏమిటి?" అన్నది సుశీల.

"ఒక విధంగా అంతే!" అన్నాను.

తరువాత కామరాజూ, సుశీల పట్నం వెళ్ళారు. వెళ్ళిన నెల లోపుగా ఆమెకు వేషం దొరికింది. ఈ సంగతి తెలు

పుతూ నాకు కామరాజు ఉత్తరం రాశాడు. కథ సుఖాంత మయిందిగదా అనుకున్నాను.

కాని కొద్దిరోజులకే కామరాజు వచ్చేశాడు. సుశీలను వాడు వొదిలి పెట్టేశానన్నాడు. ఆశ్చర్యంగా కారణ మేమిటన్నాను. ఆమె నటించే పిక్చరుతాలూకు డైరెక్టరుతో ఆమె సంబంధం పెట్టుకున్నదని వాడు చెప్పాడు.

"ఆ మనిషి నా సంపర్కంతో మారిందని భ్రమ పడ్డాను. ఏమీ మారలేదు" అన్నాడు వాడు.

తరువాత నాకు సుశీల ఉత్తరం రాస్తూ, "మీ మగ వాళ్ళు నిజంగా పరమ నీచులు, అయినా, కామరాజుగారి రుణం తీర్చుకున్నానని తృప్తిగా ఉంది" అని రాసింది.